క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధంగా తరగతి గదులు



జి.సిగడాం: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం నిర్మించిన తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేశామని కాంట్రాక్టర్ తెలిపారు. విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరనుందని ప్రిన్సిపాల్ ఉషారత్నకుమారి అన్నారు.

ట్రాఫిక్ డీఎస్పీకి సత్కారం



ప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో ఐదేళ్ల పాటు సేవలందించిన ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావును సీఐ అవతారం ఆధ్వర్యంలోని సిబ్బంది ఆదివారం సత్కరించారు. డీఎస్పీ ప్రసాద్ ఆదివారం రిలీవ్ అవ్వడంతో ఇకపై స్టేషన్ పూర్తి బాధ్యతలు సీఐ అవతారం చూసుకోనున్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ వెంకటరమణ, నాగరాజు, సీసీ వాసు, పీసీలు నరేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేమన పద్యాల్లో ఆత్మజ్ఞానం



వేమన పుస్తకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గార: వేమన పద్యాల్లో నీతి వ్యాక్యాలు మాత్రమే కావని, ఆత్మజ్ఞానం ఉందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి తలసముద్రం అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కళింగపట్నం పంచాయతీలో యోగి వేమన జయంతోత్సవాల్లో భాగంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన వేమన పద్యాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ ప్రచారంలో భాగంగా దేవాలయాల రహస్యాలు, హిందుత్వ సంప్రదాయాలను కమిటీ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, రమేష్, మౌనిక, తిరుమల, గోవింద, పల్లవి, జ్యోతి, చిన్నారావు ఉన్నారు.

ముక్తుంపురంలో కొట్లాట

రణస్థలం: కొండములగాం పంచాయతీలో ముక్తుంపురం రెవెన్యూ గ్రామంలో ఓ స్థలం విషయంలో రెండు వర్గాల వారు కొట్లాటకు దిగారు. మామిడి మొక్కలు నాటిన స్థలంలో ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. కొట్లాటలో పలువురికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. జేఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ గోవిందరావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న డీపీ దేవ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మెండ శాస్త్రీలు ఆదివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

తహసీల్దార్ హత్య బాధాకరం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్యను ఆయన అపార్ట్‌మెంట్ వద్దనే హత్య చేయడం బాధాకరమని కాళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్నూరు సూర్యం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కిమ్స్ రోడ్డులోని బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహం వద్ద ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో అశ్రునివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

హిరమండలం: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అంతర్జాతీయ కృష్ణ చైతన్య మఠం వ్యవస్థాపక ఆచార్యులు, ప్రచారకులు కృష్ణ కృపామూర్తి పరమపూజ్య భక్తి వికాస స్వామి అన్నారు. మండలంలోని కూర్మ వైదిక గ్రామంలో ఆదివారం హరినామ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామి వారిని సాదరంగా ఆహ్వానించారు.

బాగుబడింది





బాతువ ఎంపీపీ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, ముఖ్యంగా మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ గ్రామంలోని పలువురు విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చేరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన తర్వాత నాడు–నేడు పథకం ద్వారా ఈ పాఠశాలకు రూ.28 లక్షలను మంజూరు చేశారు. పక్కా భవనాలు నిర్మించారు. మరగుదొడ్లు ఏర్పాటు చేశారు. బెంబీలు, ఫ్యాన్‌లు, విద్యుత్, తాగునీరు ఇతర మౌలిక వసతులు కల్పించారు. ఈ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

–జి.సిగడాం

నేడు

నేడు ఆహ్లాదకరంగా ఉన్న బాతువ ఎంపీపీ పాఠశాల



నాడు

నాడు బాతువ ఎంపీపీ పాఠశాల దుస్థితి

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



రణస్థలం: శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల, ధర్మవరం గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయాల్లో ఉన్న కథలు, పోటీ పరీక్షలు, ఇతర విజ్ఞాన పుస్తకాలు ప్రదర్శించారు. విద్యార్థులు పుస్తకాలు సద్వినియోగం చేసుకోని విజ్ఞానం పొందాలని సూచించారు. గ్రూప్స్, డీఎస్సీ వంటి పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నట్లు గ్రంథాలయ అధికారులు ఎం.నీలమ్మ, మలిపెద్ది చంద్రశేఖర్ తెలిపారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పటం, పద్యాలు చెప్పటం, పుస్తకాలు చదవటంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రణస్థలంలో..

రణస్థలం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ రకాలైన విజ్ఞానం పెంపొందే పుస్తకాలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పుస్తకాలున్నాయని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. చదవడం–మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో దినపత్రికలు, కథలు చదివించడం, రాయించడం చేయించారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు కరిమజ్జి భాస్కరరావు, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

బలగలో..

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ శాఖా గ్రంథలయంలో పుస్తక ప్రదర్శన, చదవడం నాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను మాట్లాడుతూ.. గ్రంథాలయంలో ప్రతి నెల మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన, ప్రతి ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత ఉన్నారు.

లావేరులో..

శ్రీకాకుళం కల్చరల్: లావేరు గ్రంథాలయంలో కూడా పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం బాలసాహిత్యం, పంచతంత్రం కథలు అందుబాటులో ఉంచామన్నారు. గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు



లావేరు పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రమణ

శ్రీకాకుళం అర్బన్: ఎన్నికల హామీలను విస్మరించి, దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతున్న కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ కోరారు. శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల పోలారావు, ఉప్పాడ సూర్యనారాయణ, ఎలక్ట్రీషియన్ సంఘం నాయకుడు బమ్మిడి వేణు, బైకు మెకానిక్ సంఘం నాయకుడు చిట్టి సింహాచలం, మత్స్య కార్మిక సంఘం నాయకులు నాగుల తవుడు, ఆటో యూనియన్ నాయకులు చుక్క రాము పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు హౌసీ పోటీలు జరిగాయి. 20 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సంస్థ వ్యవస్థాపకుడు ఎల్.నందికేశ్వరరావు బహుమతి ప్రదానం చేశారు. క్లబ్ నిర్వాహకులు నిక్కు హరిసత్యన్నారాయణ, బి.ఎం.ఎస్.పట్నాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.

తెప్పలకు లయన్స్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ప్రతిష్టాత్మక ప్రొగ్రెస్సివ్ మెల్విన్ జోన్స్ ఫెలో పురస్కారం లభించింది. 316 మల్టీపుల్ లయన్స్ జిల్లా ఎల్‌సీఐఎఫ్ రికగ్నిషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ లయన్స్ పూర్వ అధ్యక్షుడు లయన్ ఫ్రాంక్‌జె మోరి, లయన్స్ జిల్లా 316 ఏ గవర్నర్ లయన్ డాక్టర్ గోపాలరావులు కృష్ణమూర్తికి పురస్కారాన్ని అందజేశారు. పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షులు రోణంకి హేమాచలం, సభ్యులు కృష్ణమూర్తిని అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యులు

సోంపేట: సత్యసాయి సేవా సంస్థల కుటుంబ సభ్యులు పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, సేవాదల్ ఇన్‌చార్జి రామచందర్ రావు అన్నారు. సోంపేట సత్యసాయి దివ్య మందిరంలో ఆదివారం సత్యసాయి సంఘప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాథ గుప్త, యూత్ కోఆర్డినేటర్ ఈపరి రవి, జోనల్ కన్వీనర్ కందుల కాశీ, సమితి కన్వీనర్ టంకాల బాపూజీ, 200 మంది క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేత గొల్లమాకన్నపల్లి

మందస:

ఉద్దాన ప్రాంతమైన పెద్దలింబుగాంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. 56 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో గొల్లమాకన్నపల్లి, మామిడిపల్లి జట్లు తలపడగా.. విజయతగా గొల్లమాకన్నపల్లి నిలిచింది. ద్వితీయ స్థానాన్ని మామిడిపల్లి, తృతీయస్థానాన్ని శ్రీకాకుళం, నాలుగో స్థానాన్ని లింబుగాం జట్లు కైవసం చేసుకున్నాయి. వీరికి ఎంపీటీసీ మాజీ సభ్యుడు మండల లచ్చయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాలీన లక్ష్మీనారాయణ, మండల ధర్మారావు, దాసరి చంద్రశేఖర్‌లు అందించిన రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10వేలు నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో సెక్రటరీ ఎ.చిరంజీవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.అప్పలస్వామి, నర్తు రవి(తిరుపతి), పులారి వీరస్వామి, బదకల రేఖారావు, నర్తు దేవేంద్ర, ఈశ్వరరావు, తలగాన రాజశేఖర్, బదకల జానకిరావు, పులారి అప్పలస్వామి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అమరవీరుల ఆశయాలను కొనసాగించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: అమరవీరులు ఆశయాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ అన్నారు. అక్కుపల్లిలో ఆదివారం అమరవీరుడు మద్దు రాంబాబు స్మారక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పీడిత ప్రజల నాయకుడిగా కామ్రేడ్ రాంబాబు పోరాటం చేశారని గుర్తు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, కుమారన్న, జయక్క, రాపాక మాధవరావు ఉన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా సిమ్మినాయుడు

ఆమదాలవలస:

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎస్.సిమ్మినాయుడు ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం మున్సిపల్ లక్ష్మీనగర్ హైస్కూల్ ఆవరణలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా బొడ్డేపల్లి జనార్దనరావు, గౌరవ అధ్యక్షుడిగా బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారిగా హెచ్.వి.సత్యనారాయణను ఎన్నుకున్నారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయి డీఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పెన్షనర్ల సంఘం కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సిమ్మినాయుడు

వసతులకు నిలయం.. గురుకులం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం



విశాలంగా ఉన్న రహదారి

● ఆనందంలో బాలికలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం బాలికలకు వరంలా మారింది. ఇక్కడ అందుతున్న విద్య, వసతి సౌకర్యాలపై విద్యార్థినుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విశాలమైన వాతావరణం, మౌలిక సదుపాయాలు, మంచి భోజనం, విద్యార్థినులపై ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ ఉండడంతో అందరూ ఆనందంలో ఉన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధకనబరుస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ 527 మంది విద్యనభ్యసిస్తున్నారు. 25 బోధన సిబ్బంది పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఆరుగురు మహిళా గార్డులు విద్యార్థినులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

నాడు-నేడు నిధులతో అభివృద్ధి



రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోంది. నాడు–నేడు పథకం ద్వారా రూ.3.50 లక్షలు మంజూరు కావడంతో చిన్నచిన్న మరమ్మతులను సైతం చేసుకున్నాం. మంత్రి ధర్మాన ప్రసాదరావు సహకాంతో ప్లాక్షయినర్‌ను ఏర్పాటు చేసుకుని స్కూల్ ప్రహరీ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, చెట్లు, కల్వర్టులో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించాం. ప్రతీ ఆదివారం తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వచ్చినప్పుడు షెల్టర్ లేక ఇబ్బందులు పడేవారు. మంత్రి ధర్మాన చొరవతో నాబార్డ్ నిధులతో వెయింట్ హాల్‌ను ఏర్పాటు చేసుకున్నాం.

–జ్యోతి, ప్రిన్సిపాల్

విద్య, వసతులు చాలా బాగున్నాయి



నా పేరు ఎం.భార్గవి. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఇక్కడే చదువుతున్నాను. పదో తరగతిలో మంచి మార్కులు వచ్చాయి. ఇక్కడ వసతులు, విద్య, భోజన సదుపాయాలు బాగున్నాయి. పేద విద్యార్థులకు అంబేడ్కర్ గురుకులాలు వరంలాంటిది. నాడు–నేడు పథకంతో పాఠశాలలకు మహర్దశ పట్టింది.

ఆలయ అభివృద్ధికి పలువురు విరాళం



విరాళాన్ని ఈవోకు అందజేస్తున్న దాతలు రేవతి, లక్ష్మి తదితరులు



విరాళ చెక్కును ఈవోకు అందజేస్తున్న సునీల్ నాయక్ దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అభివృద్ధి పనుల కోసం శ్రీకాకుళం నగరానికి చెందిన పి.రేవతి, పి.లక్ష్మిలు సంయుక్తంగా తమ తల్లిదండ్రులు రామారావు, కృష్ణవేణిల జ్ఞాపకార్థం రూ.1.55 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు విరాళాన్ని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి ఆధ్వర్యంలో ఆదివారం అందజేసారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులున్నారు.

డాక్టర్ సునీల్‌నాయక్ రూ.లక్ష..

సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో పలు అభివృద్ధి పనుల కోసం నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు సునీల్‌నాయక్, డాక్టర్ విజయ దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ ఉన్నారు.



విరాళమిస్తున్న దాత సురేష్‌కుమార్

నిత్యాన్నదానానికి రూ.లక్ష..

సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన ఎస్.వి.ఎన్.సురేష్‌కుమార్ తన తల్లి దండు సూర్యకాంతి పేరు మీద రూ.లక్ష విరాళాన్ని ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి ఆధ్వర్యంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఉన్నారు.

యువజన సంఘాలకు ప్రోత్సాహం

కవిటి: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటిలో ఉషోదయ యువజన సంఘం భవనం నిర్మాణానికి జిల్లాపరిషత్ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన పనులకు చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలాలు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు కడియాల ప్రకాష్, పాండవ శేఖర్, కృష్ణరావు, ఎన్ని అశోక్, బద్రి ప్రకాష్, నర్తు అశోక్, సంఘం గౌరవ అధ్యక్షులు బెందాళం చిట్టిబాబు, తమరాల జయరాం ఉన్నారు.



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

సనాతన ధర్మాన్ని కాడాలి

సరుబుజ్జిలి: సనాతన హైందవ ధర్మాన్ని కాపాడేందుకు రామ సేవకులంతా కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు అన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ధర్మ జాగరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ ఇంటా రామనామస్మరణ, భజనలు జరగాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి ధర్మవరపు ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ధర్మ జాగరణ సమితి ఏర్పాటు చేశారు. మండల ప్రముఖ్‌గా బెండి లక్ష్మీనారాయణ, సహప్రముఖ్ బగ్గు అప్పలరాజు, కమిటీ సభ్యులుగా అల్లు తిరుపతిరావు, సీపాన రవికుమార్, కూన అప్పలనాయుడు నియమించారు.



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు

ప్రత్యేక పూజలు

హిరమండలం: స్థానిక సత్యసాయి సేవాసమితిలో సమితి కన్వీనర్ ఎ.వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం బాలవికాస్ విద్యార్థులతో గాయత్రీ తండులార్చన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రీ మంత్రోచ్ఛరణ చేయడం ద్వారా విద్యాబుద్ధులు వస్తాయని, మానసిక ఆందోళన నుంచి విముక్తి పొందవచ్చన్నారు.